# అక్రమాలకు ప్రోత్సాహం...
# ఘటనలపై పరిహారంతో సరి!

**- ఆక్రమణ భవనాలపై అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై సర్వత్రా ఆరోపణలు**
**- తొలుత అవినీతిని కట్టడిని చేస్తేనే ప్రమాదాలు నివారణ**

**హైదరాబాద్, మే19, ప్రభాతవార్త:** నగరంలో వరుసగా చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాల ఘటనలపై ఆయా శాఖలు, ప్రజాప్రతినిధుల లో పాలు, అవినీతి మరకలే స్పష్టంగా కనిపిస్తున్నాయి. అనుమతుల పర్వంలోనే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆమ్యామ్యాలతో పనులు కానిస్తున్నారు. అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టిన ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో చేసేదేమి లేక కళ్లుమూసుకొని అక్రమనిర్మాణాలకు అనుమతలిస్తున్నారు. ఏదైన అగ్నిప్రమాదాల ఘటనలు ఏర్పడితే పరస్పర ఆరోపణలు చేసుకుంటూ తప్పులను కప్పిపుచ్చుకుంటున్నారు. ఒక భారీ నిర్మాణానికి బల్దియాతో పాటు విద్యుత్తు, పోలీస్, అగ్నిమాపక శాఖల అనుమతులు తప్పనిసరని చట్టం చెబుతోంది. అయితే కొంతమంది రాజకీయ నేతలే అధికారుల అవతారాలు ఎత్తి అన్నింటిలో జోక్యం చేసుకుంటూ అక్రమాలకు కారకులవుతున్నారు. ఏదైన అధికారులు వ్యతిరేకిస్తే ట్రాన్స్ ఫర్‌లు చేయించడం, కక్ష్యసాధింపులు చేపట్టడం చూస్తున్నే ఉన్నాం. దీంతోనే లోపాలు బయటపడి ఎన్నో దారుణాలు జరుగుతున్నాయి. ఘటన తర్వాత బాధితులకు పరిహారాలు, విచారణలు, కేసులు నమోదంటూ హాడావిడితోనే పుణ్యకాలం గడిచిపోతుంది. తాజాగా జరిగిన అగ్నిప్రమాదాల ఘటనల్లో పరిణామాల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి.

**ఇవి కావా..ప్రమాదాలకు ఆనవాళ్లు...**

వందగజాల్లోపు భవనాలకు ఏశాఖ అనుమతి లేకపోయిన సదరు అక్రమార్కుడు అద్దెల కోసం అయిదారు అంతస్తులకుపైబడే నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై ఆయా శాఖల అధికారులు నిరాకరించి చర్యలు చేపడితే చోటమోటా నేతల నుంచి బడాస్థాయి ప్రజాప్రతినిధుల్లో పైరవీలు చేస్తూ అక్రమాలను సక్రమం చేసుకుంటున్నారు. అయిదేళ్ల పాటే పదవుల్లో ఉండి వెళ్లాక వెలుగులోకి వచ్చిన కొన్నేళ్లుగా జరిగే ప్రమాదాల ఘటనలతో సామాన్య, పేద ప్రజలే నష్టపోతున్నారు.




ప్రభుత్వ నిబంధనలను కాదని కడితే భవిష్యత్తులో పర్యావసనం అనుభవించక తప్పదని కొన్ని ఘటనలు సాక్ష్యాధారాలతో కనిపిస్తున్నాయి. పాతబస్తీలోని మీర్‌చౌక్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మూడుతరాలకు చెందిన కుటుంభాలు మృతిచెందారు. కరెంట్ కేబుళ్ల నిర్వాహకంతో ప్రమాదం జరిగిందని పలువురు స్థానికులు చెబుతున్నారు. కనీసం భద్రత చర్యలు చేపట్టే శాఖలకు సరైన అవకాశానికి వీలులేకుండా ఉండడంతో క్షతగాత్రుల ప్రాణాలు పోతున్నాయి.

ముఖ్యంగా అగ్నిప్రమాదాల విషయంలోనే ఫైరింజన్ రాలేని దుస్థితి ఉంటుంది. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడే అవకాశాలు చాలా తక్కువగానే ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆయా కాలనీలు, బస్తీల్లో ఇలాంటి భవనాలు అధికంగా కనిపిస్తాయి. పేదల నివాసాలను కొనుగోలు చేసి చిన్నపాటి ఇరుకుల్లోనూ కీలకనేతల అండలతో భారీస్థాయిలో నిర్మించి అద్దెలకిస్తున్నారు. అదేవిధంగా వంద గజాలకు పైబడి ఉన్న భవంతుల్లో కూడా ఎన్నో అతిక్రమణలే దర్శనమిస్తున్నాయి.

**తొలుత అవినీతి కట్టడి..ఆపై నిబంధనలు**

ఆయా శాఖల పరిపాలన విధుల్లో ప్రభుత్వ నిబంధనలే పాటించాలి. ఎక్కడో ఒకచోట చిన్నపాటి నిర్లక్ష్యం ఉన్న ఫరవాలేదులే...మరో ప్రత్యామ్నాయం ఉంటే మినహాయింపు ఉండాలి. కానీ ఇందుకు విరుద్ధంగా అధికారులు, నేతల చేతివాటలతో భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు ఆజ్యం పోస్తున్నారు. తొలుత అవినీతిని పారద్రోలి అధికారులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ కల్పిస్తేనే విపత్తు ఘటనలు తగ్గేఅవకాశం ఉంది. అక్రమాలను భూస్థాపితం చేసి ప్రజలకు మద్దతుగా ఉంటూ నిబంధనలను పాటిస్తూ ప్రభుత్వపరమైన సేవలందించి అభివృద్ధికి తోడ్పాటందించాలని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పాతబస్తీతో పాటు సికింద్రాబాద్, మియాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మలక్‌పేట, ఎల్‌బినగర్, చందానగర్‌లతో పాటు మరెన్నో ప్రాంతాల్లో అక్రమభవనాలే కనిపిస్తున్నాయి. ఏళ్లనాటి భవనాలతో పాటు కొత్తవాటిపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించి ఆయా శాఖల అధికారులతో ఆక్రమణలపై చర్చించి చర్యలు చేపడితే కొంతైన ప్రమాదాలను నివారించవచ్చని ఆయా శాఖల రిటైర్డ్ ఉన్నతస్థాయి అధికారుల అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్ వార్త



# ఆక్రమణలను తొలగించిన హైడ్రా

**-పుప్పాల గూడ, హైదర్‌నగర్‌లో కబ్జాలకు విముక్తి**
**-ప్రజావాణి ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన**
**-ఆక్రమణ అని తేలితే కట్టడాలు నేలమట్టం**



డైమండ్ హిల్స్‌లో ఆక్రమణలు తొలగించి హైడ్రా చదును చేసిన ప్రాంతం

**హైదరాబాద్, మే 19,ప్రభాతవార్త :** నగరంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆక్రమణలను సోమవారం హైడ్రా తొలగించింది. కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్, మణికొండ మున్సిపాలిటీలోని పుప్పాలగూడలో హైడ్రా చర్యలు తీసుకుంది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి ఆదేశాలివ్వడంతో ఈ ఆక్రమణల తొలగింపు జరిగింది. ఈరెండు చోట్ల ఆక్రమణల పర్వం ఒక్కో విధంగా ఉంది. హైదర్‌గూడ సర్వే నంబరు 145లోని 9ఎకరాలలో డైమండ్ హిల్స్ పేరిట 2000 సంవత్సరంలో లే ఔట్ వేశారు. 79 ప్లాట్ల ఈ లేఔట్‌కు హెచ్ ఎండీఏ (గతంలో హుడా) అనుమతి కూడా ఉంది. 2007లో అన్ రిజిస్టర్డ్ అసైన్‌మెంట్ డీడ్‌తో ఆక్రమణల పర్వం మొదలైంది. ప్లాట్ యజమానులు పార్టీ కాని కేసులో ఎక్స్ పార్టీ డిక్రీ తీసుకుని బైలీఫ్ ద్వారా వ్యవసాయ భూమి అని చూపుతూ 7 ఎకరాలు ఆక్రమించారు. ఆకేసులో ప్లాట్ యజమానులను పార్టీ చేయకుండా కోర్టును తప్పుదోవ పట్టించి పొందిన బైలీఫ్ అర్డర్‌తో డైమండ్ హిల్స్ లే ఔట్‌లోని స్విమ్మింగ్‌పూల్, రహదారులు, పార్కులు, ప్లాట్లు హద్దులు, పునాదులను చెరిపేసి ఆక్రమించాడని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా ఖాళీ చేయడం లేదంటూ వాపోయారు. కోర్టులో వివాదం ఉంటుండగా.. ఆ భూమిని వివిధ సంస్థలకు పార్కింగ్ కోసం అద్దెకు ఇచ్చి నెలకు రూ. 50 లక్షలకు పైగా తీసుకుంటున్నాడని బాధితులు చెప్పారు. ఇలా ఏడెనిమిదేళ్లుగా అద్దె అనుభవించాడని తెలిపారు. మిగతా 2 ఎకరాలలో ఉన్న ప్లాట్లకు వెళ్లడానికి వీలు లేకుండా ఫెన్సింగ్ వేశాడని వాపోయారు. హైకోర్టు ఉత్తర్వులతో ప్లాట్ల వద్దకు వెళ్తే తమను లోపల పెట్టి గేటు వేశారంటూ వాపోయారు. ప్రజావాణికి వచ్చిన ఈ ఫిర్యాదుపై హైడ్రాతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ రంగనాథ్ గత బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తర్వాత ఇరు పక్షాలను కార్యాలయానికి పిలిచి విచారించారు. సంబంధిత కోర్టు ఉత్తర్వులు, పత్రాలు పరిశీలించాక హైడ్రా కమిషనర్ ఆదేశాలతో సిబ్బంది సోమవారం ఉదయం అక్కడ ఆక్రమణలను తొలగించింది. ఈ స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు బోర్డు పెట్టింది. లే ఔట్ ప్రకారం రహదారులు, పార్కుల హద్దులను హైడ్రా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటోంది.

**డాలర్‌హిల్స్ లోనూ అదే కథ..**

నార్సింగి మండలం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని డాలర్ హిల్స్ లో కూడా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. సర్వే నంబరు .104,1, 106, 113లలో సంతోష్‌రెడ్డి అనేవ్యక్తి అతని మిత్ర బృందానికి మొత్తం 60 ఎకరాల భూమి ఉంది. ఇందులోని 30 ఎకరాలలో 1998లో డాలర్‌హిల్స్ పేరిట ఆవ్యక్తి లే ఔట్ వేశారు. హెచ్ ఎండీఏ ప్రిలిమనరీ లే ఔట్ తో మొత్తం 80 శాతం ప్లాట్లు అమ్మేశారు. సరైన సమయంలో చెల్లింపులు, అభివృద్ధి చేయకుండా లే ఔట్ రద్దయ్యేలా ప్రయత్నించారు. సాంకేతిక కారణాలతో 2005లో ఈ లే ఔట్‌ను హెచ్ఎండీఏ రద్దు చేసింది. స్థల యజమానులు కుమ్మక్కయి ఒక అవగాహనకు వచ్చి వ్యవసాయ భూమిగా తర్వాత మార్చుకున్నారు. ఇది అప్పటికే ప్లాట్లు కొన్నవారికి తెలియదు. తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అనుమతులు తీసుకుని కొంత మంది ఇళ్లు కట్టుకున్నారు. డాలర్‌హిల్స్ లే ఔట్‌లోని 2 ఎకరాల పార్కు, రహదారులతో పాటు కొన్ని ప్లాట్లను కలిపి పక్కనే ఉన్న 30 ఎకరాల భూమికి జోడించారు. మొత్తం వ్యవసాయ భూమిగా పేర్కొంటూ ఎన్‌సీసీ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు సంతోష్‌రెడ్డితో పాటు భూమిపై హక్కు ఉన్నవారు అమ్మేశారు. 2016 నుంచి ఈ వివాదం కోర్టులో ఉంది. కోర్టులో వివాదం ఉండగానే అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. అయినా అనుమతులేవీ లేకుండా ఎన్‌సీసీ అక్కడ నిర్మాణాలు చేపడుతోందని డాలర్‌హిల్స్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కమిషనర్ రంగనాథ్ ఈ నెల 14వ తేదీన క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించారు. తర్వాత హైడ్రా కార్యాలయానికి ఇరు పక్షాలను పిలిచి విచారించారు. సంతోష్‌రెడ్డిపై తాము నార్సింగ్ పోలీసు స్టేషన్ లో కేసు కూడా పెట్టామని ప్లాట్ల యజమానులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా సదరు సంస్థ చేపట్టిన నిర్మాణాలను ఆపడమే కాకుండా.. వాటిని హైడ్రా సోమవారం తొలగించింది. అనుముతు లేకుండా సెల్లార్లు తవ్వడం, పేలుడు పదార్థాలను వినియోగించడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. ఈ భూమిని కాపాడినట్టు హైడ్రా బోర్డులు పెట్టింది.

# ప్రజావాణి విన్నపాలను త్వరగా పరిష్కరించాలి

**-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

**హైదరాబాద్,మే 19,ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పై విన్నపాలను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ... ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలను వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని బాధ్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఆర్థిక పరమైన అర్జీల పై క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకున్నది, లేనిది సంబంధిత అర్జీదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 66 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 33, ఇంజనీరింగ్ 6, ట్యాక్స్ సెక్షన్ 5, ఎలక్ట్రిక్, ల్యాండ్ అక్విజిషన్, ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్, హౌసింగ్, విజిలెన్స్ విభాగాలకు రెండు చొప్పున, హెల్త్, ఎస్టేట్, లేక్స్, యు.బి.డి విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 113 అర్జీలు వచ్చాయి. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్‌లు వేణు గోపాల్, పంకజ, గీతా రాధిక, నళిని పద్మావతి, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి లు గంగాధర్, వెంకన్న, ఎల్.ఏ.ఓ రాము నాయక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజావాణితో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

ప్రజావాణి కార్యక్రమంతో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 101 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఆఅర్జీలను శాఖాధికారులు సత్వరమే పరిశీలన చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో హౌసింగ్ 46, పెన్షన్ 16, ఇతర శాఖలకు సంబంధించినవి 39 దరఖాస్తులు అందాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, జి. ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ. వెంకట చారి, జిల్లా అధికారులు జి. ఆశన్నా, సురేందర్, రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

# రూ 26.55కోట్లతో బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ

**-12మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు,వెయిటింగ్ హాలు**
**-హైదరాబాద్‌లోని ముఖ్యస్టేషన్లలో ఒకటి బేగంపేట**



**బేగంపేట మే 19,ప్రభాతవార్త :** హైదరాబాద్ జంట నగర ప్రాంతంలోని ముఖ్యమైన స్టేషన్లలో బేగంపేట స్టేషన్ ఒకటి అని సబర్బన్ నాన్ సబర్బన్ ప్రయాణీకుల అవసరాలను తీరుస్తుందని అన్నారు. ఈ స్టేషన్ ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ 26.55కోట్లతో దీనిని పునరాభివృద్ధి చేసామని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ అన్నారు. సోమవారం రాష్ట్రంలో ఇటీవల అభివృద్ధి చేసిన బేగంపేట ,కరీంనగర్, వరంగల్ అమృత్ స్టేషన్లలో అభివృద్ధి చేసిన సౌకర్యాలను వివరించేందుకు గైడెడ్ మీడియా టూర్ ను నిర్వహించారు. బేగంపేట రూ 26.55కోట్లు, కరీంనగర్ రూ 25.85కోట్లు, వరంగల్ రూ 25.41కోట్లతో పునరాభివృద్ధి చేసామన్నారు. బేగంపేట స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన స్టేషన్ భవనం, సర్క్యులేటింగ్ ప్రాంతం, ప్రవేశద్వారం, 12మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాలు మొదలైన వాటిని విలేఖరులకు చూపించారు. సుమారు రూ 12కోట్ల వ్యయంతో రెండవ ప్రవేశ ద్వారం అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు జరుగుతున్నాయని, మీడియాకు వివరించారు. అన్ని పనులు పూర్తియి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. సికింద్రాబాద్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ విశాల్ మాట్లాడుతూ స్టేషన్ వివరాలు, స్టేషన్‌లో అందిస్తున్న సేవలు అందుబాటులో ఉన్న రైళ్ల సమాచారం ప్రయాణీకుల సౌలభ్యం కోసం అందించే సౌకర్యాల ను వివరించారు. అదే విధంగా కరీంనగర్, మరియూ వరంగల్ స్టేషన్లలో కూడా అక్కడి స్టేషన్ల ఆధునీకరణను మీడియాకు వివరించామన్నారు. కరీంనగర్‌లో సికింద్రాబాద్ డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ పి. శివప్రసాద్, ఇతర రైల్వే అధికారులతో కలిసి స్టేషన్‌లో అభివృద్ధి చేసిన సౌకర్యాల గురించి మీడియాకు వివరించగా, వరంగల్ స్టేషన్ సికింద్రాబాద్ డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఐఎస్ఆర్ మూర్తి ఇతర సిబ్బందితో కల్సి అక్కడి స్టేషన్‌లో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారన్నారు. తెలంగాణా రాష్ట్రంలో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దాదాపు రూ 2750కోట్లతో అభివృద్ధి చేయాలని 40రైల్వేస్టేషన్లను గుర్తించారన్నారు. బేగంపేటలో అభివృద్ధి పనులతో మరింత రద్దీ పెరగనుందన్నారు. ప్రస్తుతం దాదాపు 15000 మంది రైలు వినియోగదారుల రాకపోకలతో దాదాపు 100రైళ్లను నిర్వహిస్తుందని, ఏబీఎస్ఎస్‌లో భాగంగా ఆధునిక సౌకర్యాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినట్లు తెలియజేసారు.



,బేగంపేట రైల్వేస్టేషన్‌లో విలేఖరులతో రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్న రైల్వే సీపీఆర్ఓ ఎ.శ్రీధర్.

# హైడ్రా ప్రజావాణికి 59 ఫిర్యాదులు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త:** ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసేయడం పరిపాటిగా మారిపోయిందని అనుకుని గమ్మున ఉండడంలేదు నగర ప్రజలు ఇప్పుడు. ఒకదాని తర్వాత ఒకటిగా పరిష్కారమౌతున్న తీరును చూసి హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేస్తే దశాబ్దాల సమస్యకు పరిష్కారం ఇట్టే దొరుకుతోందని గ్రహించిన నగరవాసులు పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాపై ఫిర్యాదులు చేస్తున్నారు. హైడ్రా ప్రజావాణికి సోమవారం వచ్చిన 59 ఫిర్యాదుల్లో 70 శాతం సామాజిక ఫిర్యాదులే ఉన్నాయి. టోలిచౌకి హకీంపేటలో బాబా హోటల్ వద్ద రోడ్డును ఆక్రమించి షాపు పెట్టేశారంటూ నివాసితులు ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో సర్వేనంబరు 155లో ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన 3500ల గజాల స్థలాన్ని కబ్జా చేస్తున్నారని భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ ప్రజావాణికి ఫిర్యాదు చేసింది. గతంలో మున్సిపాలిటీ అధికారులు కూల్చేసినా దానిని మళ్లీ కబ్జా చేస్తున్నారని పేర్కొంది. ఓయూ కాలనీలో తమ ప్లాట్ ను నలువైపుల మూసివేయడంతోపాటు రహదారి పక్కనే ఉన్న శ్మశానాన్ని కూడా విక్రయించారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల గ్రామంలో సర్వే నంబరు 33 10లో మొత్తం13 ఎకరాల భూమి ఉండగా.. అందులో 6 ఎకరాల్లో మాతా అరవింద్ కాలనీ ఉంది. మిగతా 7 ఎకరాలను సొంతం చేసుకున్న వ్యక్తి తమది దేవాదాయ శాఖ పరిధిలో ఉందంటూ అధికారులకు ఫిర్యాదు చేసి రిజిస్ట్రేషన్లు అవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఎవరిది దేవాదాయ శాఖ పరిధిలో ఉందో తేల్చాలని.. హైడ్రాను కోరారు.

## సెల్లార్‌ల తవ్వకాలపై జిహెచ్ఎంసి ఫోకస్

**హైదరాబాద్, మే 19,ప్రభాతవార్త:** వర్షాకాలంలో నేపథ్యంలో సెల్లార్ల తవ్వకాలపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఫోకస్ పెట్టారు. మాన్సున్ ప్రారంభం నుంచి ముగిసేవరకు కొత్త సెల్లార్ల తవ్వకానికి నిషేధం విధించనున్నారు. అలాగే ఇప్పటికే తవ్విన సెల్లార్ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సర్కిల్ స్థాయిలో సర్వే నిర్వహించి గుర్తించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న స్థలాలను జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలించనున్నారు. సెల్లార్ సెట్‌బ్యాక్‌లను సరిచూసుకోవడంతో పాటు బిల్డింగ్ ప్లాన్ ప్రకారమే సెల్లార్ నిర్మాణం జరుగుతుందా? లేదా? అనేది చూడనున్నారు. ఇప్పటికే తవ్విన సెల్లార్లలో నీళ్లు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం, రిటైనింగ్ వాల్ నిర్మాణం, బారికేడింగ్ వంటి వాటిని పరిశీలించనున్నారు. సెల్లార్లు నిర్మాణం చేయకపోతే వాటిని మూసివేసేలా చర్యలు చేపట్టనున్నారు. శిథిలాలు, కూల్చిన వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్‌కు రవాణా చేసే లా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నోటీసులకు స్పందించకుంటే ని ర్మాణ అనుమతులు రద్దు చేయడం, బిల్డర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జీహెచ్ఎంసీ హెచ్చరికలు జారీ చేశారు.

## సికింద్రాబాద్‌లో ఉగ్రవాది కలకలం

**హైదరాబాద్, మే19, ప్రభాతవార్త:** నగరంలో ఉగ్రవాది కలకలం రేపింది. ఏపీ ఇంటలిజెన్స్, తెలంగాణ పోలీసులతో కలిసి నిఘా పెట్టి ఏపీలో సిరాజ్, బోయగూడకు చెందిన సమీర్‌ను అదుపులోకి విచారించింది తెలిసిందే. అతని వద్ద నుంచి పలు కీలక సమాచారాలు రాబట్టారు. సికింద్రాబాద్‌లోని భారీ పేలుళ్లకు కుట్రపన్నారని గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సదరు ఉగ్రసానుభూతిపరుడి నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించి నిఘాపెట్టారు. పరిసరప్రాంతాల్లో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

# ఆరాంఘర్‌లో ప్రారంభమైన సిసి రోడ్డు పనులు

**-15 రోజులు రోడ్డు బంద్.. ట్రాఫిక్ మళ్లింపు**



**అత్తాపూర్ మే19,ప్రభాతవార్త :** ఆరాంఘర్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ మళ్లించాడం జరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ రాజేందర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆరాంఘర్ రైల్వే వంతెన కింద సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఎల్బీనగర్ నుంచి మెహదీపట్నం వెళ్లే దారిలో ప్రధానంగా దుర్గా నగర్ నుండి ఆరాంఘర్ వైపు వచ్చే వన్ వే ట్రాఫిక్ ను 15 రోజులు పాటు కాటేదాన్ ఓల్డ్ కర్నూల్ రోడ్డు కాలేజీ గేట్ మీదుగా ద్వారా ట్రాఫిక్ మళ్ళించారు. దింతో మొదటి రోజు ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు త్రీవ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ....రోడ్డు పూర్తి ద్వంసమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సౌకర్యం కోసం సిసి రోడ్డు నిర్మాణ జరుగుతుందని కావు సాధారణ ప్రజలు ట్రాఫిక్ మళ్లింపు చర్యలను అర్థం చేసుకొని ట్రాఫిక్ సజావుగా సాగేలా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## చిట్టీ డబ్బుల వ్యవహారం చూపుడు వేలు కొరికిన వైనం

**-కోపంతో మహిళ చూపుడు వేలు కొరికిన నిందితుడు**
**-ఆ వేలు తిరిగి అతికించలేమని తేల్చిన వైద్యులు**

**హైదరాబాద్,మే 19 ప్రభాతవార్త :** చిన్న చిట్టీ డబ్బుల వ్యవహారం పెద్ద విషాదానికి దారి తీసింది. మాటామాట పెరిగి ఒకరు చూపుడు వేలిని పోగొట్టుకోగా, నిందితుడు జైలు పాలు కావాల్సి వచ్చిన ఘటన నగరంలోని మధురానగర్‌లో చోటుచేసుకుంది. జవహర్‌నగర్‌కు చెందిన మమత అనే మహిళ.. అక్కడి మూడేళ్ల నుంచి ఓ అపార్టుమెంట్ పెంట్‌హౌస్‌లో అద్దెకు నివసిస్తోంది. అయితే.. ఇంటి యజమానురాలు సుజిత చిట్టీలు వేస్తుండేంది. ఆమె దగ్గర మమత కూడా చిట్టీలు వేస్తూ వచ్చింది. ఈ చిట్టీల వ్యవహారంలో ఇంటి యజమానురాలు సుజిత..మమతకు రూ.30 వేలు చెల్లించాల్సి ఉంది. ఇటీవల మమత ఇల్లు ఖాళీ చేసి తన స్నేహితురాలు సుప్రియకి అప్పగించింది. అయితే, సుప్రియ ఇంటిని ఖాళీ చేయడంతో సుజితకు అద్దె విషయంలో ఇబ్బందులు తలెత్తాయి. ఇదిలా ఉండగా.. తమకు చెల్లించాల్సిన డబ్బుల విషయమై మమత ఆమె భర్త హేమంత్‌సుజిత దగ్గరకు వెళ్లి డబ్బులు అడిగారు. దీంతో సుప్రియ ఇంటి అద్దె చెల్లించకుండా వెళ్లిందని..అద్దె డబ్బు మీరే ఇవ్వాలంటూ సుజిత పట్టుబట్టింది. వారి మధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలో చూస్తుండగానే గొడవ పెద్దదిగా మారింది. అయితే వాళ్ల గొడవ మధ్యలో సుజిత తల్లి లత జోక్యం చేసుకోంది. ఈ క్రమంలో.. హేమంత్‌కోపంతో..ఆమె కుడిచేతి చూపుడు వేలిని గట్టిగా కొరికేశాడు. దీంతో లత చూపుడు వేలు ఊడి కింద పడిపోయింది. అనంతరం ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కానీ వైద్యులు ఆ వేలు తిరిగి అతికించలేమని చెప్పారు. దీంతో బాధితురాలు లబోదిబోమంటూ తీవ్ర మానసిక ఆందోళనకు గురైంది.. సుజిత ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు హేమంత్ పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

### జూన్ 2వ తేదీలోగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలి

**సైఫాబాద్, మే 19 (ప్రభాతవార్త):** తెలంగాణ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ కో-ఆర్డినేషన్ కమిటీ పనిచేస్తుందని, ఉద్యోగ సంఘాలకు ఎంత మాత్రం వ్యతిరేకత కాదని కమిటీ తెలిపింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాజీ వి.శ్రీనివాస్‌గౌడ్, శాసన మండలి మాజీ స్పీకర్ స్వామిగౌడ్, నాయకులు పాతూరి సుధాకర్‌రెడ్డి, దేవిప్రసాద్, విఠల్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను తెలంగాణ అవిర్భావ దినోత్సవం జూన్ 2వ తేదీలోగా పరిష్కారించాలని, ఐదు డిఎలను ప్రకటించాలని, అలాగే పిఆర్సీని ప్రకటించాలని, పెన్షనర్స్‌కు బెనిఫిట్స్‌తోపాటు, పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, హెల్త్ కార్డులు ప్రతి ఒక్కరికి ఇవ్వాలని, ప్రతి కార్పొరేట్ ఆసుపత్రిలో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ కొసాగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గత ఏడాది కాలంలో పదవి విరమణ చేసిన 10 వేల మందికి రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వేసిన మంత్రుల కమిటీ, అధికారుల కమిటీ ఉద్యోగుల కోసం పనిచేయడం లేదని ఆరోపించారు. త్వరలో తమ కమిటీ అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశమై ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వంపై వత్తిడీ తీసుకువస్తామని వారు హెచ్చరించారు.

### సమాచార కమిషనర్ల నియామకాలలో సామజిక ఉద్యమకారుల స్థానమేది : వంశీ కృష్ణ



**హైదరాబాద్ మే 19 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమాచార కమిషనర్ల నియామకాల్లో ఉదయ్మకారులకు స్థానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్త చేసారు. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్లను ఇటీవల నియమించిన ప్రభుత్వం అందులో ఒక్క సామజిక ఉద్యమకారులను కానీ, ఒక బీసీకి గాని ఇవ్వకపోవడం బాధాకరమని జూనియర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జక్కుల వంశీ కృష్ణ, కోలా జనార్దన్ అన్నారు. ఇక ముందు నియమించే రెండు పోస్టులలోనైనా సామజిక ఉదయ్మకారులకు, బీసీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఇప్పటివరకు నియమించిన వారందరు అగ్రవర్ణాలే ఉన్నారని, నిబంధనల ప్రకారం ఈ పార్టీకి చెందనివారు ఉండాలని, ఒక న్యాయవాది, శాస్త్రవేత్త, సామజిక ఉద్యమకారుడు, ఒక పాత్రికేయుడు ఉండాలని కానీ ప్రభుత్వం ఇద్దరు జర్నలిస్టులు ఉన్నారని, ప్రభుత్వం మిగిలిన రేడు పోస్టులలో సామజిక ఉద్యమకారులకు, బీసీ లకు అవకాశం కల్పించాలని డిమేండ్ చేసారు.

### బాలభవనం సిబ్బందికి డిప్యూటేషన్, ప్రమోషన్లు, బదిలీలు కల్పించాలి

**- బాలభవనం ఉద్యోగుల సంఘం నేతలు**



రాష్ట్ర బాలభవన్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అధ్యక్షురాలు కె.వరలక్ష్మీ, ప్రధాన కార్యదర్శి ఎ.విజయలక్ష్మీ తదితరులు

**హైదరాబాద్, మే 19, ప్రభాతవార్త**

జిల్లా బాలభవనంలో పనిచేస్తున్న సిబ్బందికి డిప్యూటేషన్, ప్రమోషన్స్.బదిలీలు కల్పించాలని రాష్ట్ర బాలభవన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు కె.వరలక్ష్మీ, ప్రధాన కార్యదర్శి ఎ.విజయలక్ష్మీలు తెలిపారు. రాష్ట్ర బాలభవన్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నాంపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జవహర్ బాలభవన్, జిల్లా భవన్, బాల కేంద్ర సమస్యలపై సంఘం సుదీర్ఘ కాలం పోరాటం చేస్తూ వచ్చిందన్నారు. తమ సమస్యల పరిష్కారం కాని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించామని అన్నారు. డీఎస్సీ డైరెక్టర్,బాల భవన్ డైరెక్టర్లకు హైకోర్టు తీర్పును అమలు చేయాలని వారు కోరారు. జిల్లా బాలభవనుల వారికి ప్రమోషన్లు ట్రాన్స్ఫర్లు డిప్యుటేషన్లు కల్పించాలని హైకోర్టు తీర్పులో పేర్కొన్నారని. దీనిని నాలుగు వారాలలో అమలు పంచాలని వారు విజ్ఞప్తి చేశారు. వివిధ జిల్లాల నుండి వచ్చిన పాఠశాలకు సంబంధించిన అందరి స్కూల్ టీచర్స్‌ను వెంటనే వారి స్వస్థల స్కూల్‌లోకి పంపించాలని తీర్పు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగరశాఖ, అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్, కార్యదర్శి హరికృష్ణ పంతులు, ప్రభాకర్ రెడ్డి, అవినాష్, అమరేందర్, రాజు, మల్లికార్జున్,బాలభవన్ శివకుమార్, ఉమాబాల, లావణ్య, ప్రసన్న, బేగం, కృష్ణ, అనురాధ, ఉమా సత్యం, శంకర్, వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, సాయిచరణ్ పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శ్రీ పుష్పయాగం



మహాపూర్ణాహుతి నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 19 (ప్రభాతవార్త):** చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం పూర్ణాహుతి కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన కార్యక్రమం పాంఛరాత్రాగ శాస్త్రోక్తంగా ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్ గౌడ్ కుమారుడు, ఆలయం వంశీకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగాయి. విష్వక్సేన పూజ, రక్షా బంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహానివేదన, మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పతాధివాసము, హవనము, భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము కార్యక్రమాలను నిర్వహించారు. బ్ర హ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో లలిత సహస్ర, విష్ణుసహస్ర నామ పారాయణాలను నిర్వహించారు. బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని ఆలయం వెలుపల సాంస్కృతిక కార్యక్ర మాలు,లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు.

**నేడు ఘటాభిషేక కార్యక్రమం**

కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం 81 కలశాలతో ఘటాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయం ఈవో అన్నపూర్ణ వివరించారు. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం అరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

## పాసు బుక్కులు ఇవ్వాలని ప్రజావాణిలో ఫిర్యాదు..



ప్రజావాణిలో పిర్యాదు చేస్తున్న బిజెపి శ్రేణులు, రైతులు

**దుండిగల్, మే 19, ప్రభాతవార్త**

దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో బౌరంపేట్ 166 సర్వే నెంబర్ లావణ్య పట్టా భూమిని భూ భారతి ఆన్‌లైన్‌లో చేర్చి పాసు బుక్కులు ఇవ్వాలని సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ బీజేపీ అధ్యక్షులు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ప్రజావాణిలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా నిధులు మా నీళ్లు మా భూములు మాకే అని పోరాడి సాధించుకున్న తెలంగాణలో తెలంగాణ వచ్చినం కనే మా బౌరంపేట్ 166 సర్వే నెంబర్ రైతు లావణ్య పట్టా భూమి తెలంగాణ రాక ముందు 2014 వరకు రైతులకు హక్కులు ఉండి తరువాత 2015 రైతుల హక్కులు తొలగించడం చాలా బాధాకరమని అన్నారు. నాడు అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ పార్టీ నాయకుల సొంత లాభం కోసం రైతులకు అన్యాయం చేయడం జరిగిందన్నారు. గత పదేళ్లుగా అధికార పార్టీ నాయకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినాము. ధరణిలో చేర్చి లావణ్య పట్టా పాసుబుక్కుల వస్తే రైతు బంధు, రైతు రుణాలు, కనీసం రైతు చనిపోతే రైతు భీమా అయిన వస్తుందని ఎన్నో ఆశలతో చూశాము. ఎప్పుడు వెళ్లిన వారం, పది రోజుల్లో పని అయిపోతుందని చెప్పి కాల యాపన చేసి మాకు అన్యాయం చేశారని అధికారుల వద్ద రైతులు తీవ్ర మనోవేదన చెందారు. అనంతరం అధికారులు స్పందిస్తూ మీ మండలంలో మీ గ్రామం రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తామని, అందులో ధరణిలో మిస్సింగ్ కింద అప్లై చేసుకునే అవకాశం ఉందని, మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తెలియజేశారు. తదనంతరం బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం మారడం పథకాలు మారడం ధరణి తీసేసి భూ భారతి ఏర్పాటు చేయడం ఎంత వరకు రైతులకు ప్రయోజనం ఉంటుందో చూడాలన్నారు. దీని వలన ఇప్పుడైనా మా రైతుల కష్టాలు తీరుతాయని ఆశిస్తున్నామన్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డి ప్రభాకర్ రెడ్డి, అరుణ్ రావ్, శ్రీనివాస్ రెడ్డి, రాము, ఎన్ శ్రీపాల్ రెడ్డి, రైతులు వై శ్రీనివాస్ రెడ్డి, తలారి రాము, ఎం జీతయ్య, బాలాగారి బలరాం, కొమ్ము వీరయ్య, సిహెచ్ జీతయ్య, దుర్గేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రంథాలకు సారస్వత పరిషత్తు పురస్కారాలు : కార్యదర్శి డా. చెన్నయ్య

**నాంపల్లి, మే 19 ప్రభాతవార్త :** అనేక సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రస్థాయిలో తెలంగాణకు చెందిన వారికి వివిధ ప్రక్రియల్లో రచయితలకు తెలంగాణ సారస్వత పరిషత్తు ఉత్తమ గ్రంథ పురస్కారాలు అందిస్తున్నట్లు, ఇందులో భాగంగా 2025 సంవత్సరానికిగాను ఆయా పురస్కారాలను పరిషత్తు కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య సోమవారం ప్రకటించారు. ఈ సంవత్సరం అత్యధికంగా వనచకవితలలో 48 గ్రంథాలు పోటీకీ వచ్చాయని, పోటీకి వచ్చిన పుస్తకాలను ఒక్కోనప్రక్రియలో ముగ్గురు న్యాయనిర్ణేతలకు పంపి పురస్కారాలకు రచయితలను ఎంపికచేసినట్లు వివరించారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక ఉత్సవంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన ప్రముఖ అతిథుల చేతులమీదుగా ఈ పురస్కారాలు ప్రదానం చేస్తామని, పురస్కారం కింద ఒక్కొక్కరికి 20వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరిస్తామని డా. జె.చెన్నయ్య తెలిపారు. పురస్కార వివరాలు తెలుపుతూ పద్య/గేయ కవిత్వంలో డా. కాంచనపల్లి గోవర్ధనరాజు రచించిన నిరుడు కురిసిన నిప్పు-బల్మూరి కొండలరాయుడు గ్రంథం; వచన కవిత్వంలో ఉదారి నారాయణ రచించిన మళ్లీ మనిషిలోకి కవితా సంపుటి పురస్కారాలకు ఎంపికయ్యాయన్నారు. నవలా విభాగంలో డా. కాలువ మల్లయ్య రచించిన గువ్వలచెన్నా నవల; సాహిత్య విమర్శలో డా. సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన సవారు ముస్లిం వ్యాసాలు; కథాప్రక్రియలో రామాచంద్రమౌళి రచించిన నిర్వాణ కథల సంపుటి; ఇతర ప్రక్రియల విభాగంలో డా. సంగనభట్ల నరసయ్య రచించిన కోటిలింగాల తెలంగాణ ప్రాచీన చారిత్రక వ్యాసాలు గ్రంథానికి, బాలసాహిత్యంలో డా. అమరవాది నీరజ రచించిన ఏడురంగుల జెండా పుస్తకం పురస్కారాలకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు డా. ఎన్. ఆర్.వెంకటేశం, ఎలనాగ, రంగరాజు పద్మజ, రూప్‌కుమార్ డబ్బీకార్‌లకు వరిష్ఠ పురస్కారాలు అందజేస్తామని చెన్నయ్య విశదీకరించారు.

## 31న జలవిహార్‌లో టిజెఎఫ్ రజతోత్సవాలు

**-తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులు అల్లం నారాయణ**

**హైదరాబాద్, మే 19,ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, ఫోరం అధ్యక్షులు అల్లం నారాయణ చెప్పారు. ఈమేరకు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మే 31న జలవిహార్ లో నిర్వహించే టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ 2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించింద వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించింది అన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ చేసిన ఉద్యమం మిగతా ఉద్యమాలకు ఒక దిక్సూచి లాంటిదని టీజేఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్ అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, ఎ. రమణ కుమార్, పి.శశికాంత్, ఎం.వి.రమణ, కోశాధికారి పి.యోగానంద్, జాయింట్ సెక్రటరి యార నవీన్ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, టీయూడబ్ల్యూ జే హైదరాబాద్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రాకేష్ రెడ్డి, సోమేశ్వర్, కోశాధికారి బాబు రావు, కళ్యాణ్ చక్రవర్తి, చిన్న పత్రికల సంగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఆగస్టిన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ, క్రాంతికిరణ్, మారుతీసాగర్ తదితరులు

### బక్రీద్‌కు ఆవు మాంసంను అమ్మవద్దు

**- నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి**



సమావేశంలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తదితరులు.

**నార్సింగి, మే 19 ప్రభాతవార్త :** బక్రీద్ పర్వదినం సందర్భంగా నార్సింగి పరిధిలో ఆవు మాంసంను అమ్మవద్దని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయంలో ముస్లింలకు అవగాహన సమావేశంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే బక్రీద్ పర్వదినం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మన మతాన్ని, సంస్కృతిని మనం పాటిస్తూనే ఇతరుల మతాలను గౌరవిస్తేనే సోదర సౌభాతృత్వం పెరుగుతుందన్నారు. ఆవులను ఓ వర్గం ప్రజలు పూజిస్తారు కావున బక్రీద్ సందర్భంగా నార్సింగిలో ఆవులను అమ్మడం, కొనడం, ఆటి మాంసంను విక్రయించడంను నేరంగా పరిగణిస్తామన్నారు. చట్టానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, శాంతి సౌభాతృత్వాలు పరిడవిల్లేలా నడుచుకోవాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు ఏర్పుల కుమార్, తలారి ప్రేమ్ కుమార్, ధర్మపురి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ ఎసిపిగా సిహెచ్.శ్రీకాంత్**

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:** చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ ఏసీపీగా సిహెచ్.శ్రీకాంత్‌ను నియమిస్తూ రాష్ట్ర డిజీపీ సోమవారం సాయంత్రం ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి వరకు ఏసీపీగా బాధ్యతలను నిర్వహిస్తున్న ఎల్.రమేశ్‌కుమార్‌ను డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా 'ప్రభాతవార్త'తో శ్రీకాంత్ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బాధితులకు ఎలాంటి సమస్య ఉన్నా సత్వరమే పరిష్కరించడానికి శాయాశక్తులా ప్రయత్నిస్తానన్నారు. ఎటువంటి సమస్యలున్నా వాటి పరిష్కారం కకోసం నేరుగా కలువవచ్చని, ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణాన్ని గాంధీనగర్ పోలీసుసబ్ డివిజన్ పరిధిలోని దోమలగూడ, గాంధీనగర్, లేక్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో మరింత ధృడం చేస్తానన్నారు.ఈ రకంగా ప్రజలందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణలో మరింత మెరుగ్గా పనిచేస్తానన్నారు. చిక్కడపల్లి డివిజన్ పరిధిలోని ముషీరాబాద్, చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని అన్నారు.

### ప్రజల ఇబ్బందులపై అధికారులు వేగంగా స్పందించాలి

**- బిఆర్ఎస్ మణికొండ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**



మణికొండలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో పర్యటిస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

**నార్సింగి, మే 19 ప్రభాతవార్త :** ప్రజల ఇబ్బందులపై అధికారులు వేగంగా స్పందించాలని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. సోమవారం మణికొండలోని అల్కాపూరి టౌన్‌షిప్‌లో బిఆర్ఎస్ నాయకులు గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచినీటి సరఫరాను పెంచాలని, ఎస్టీపిల ద్వారా మురుగునీటిని శుద్ధి చేసి నాలాల్లో వదులాలని, నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేసే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని, త్వరగా వాటిని తొలగించాలని, గోతులమయమైన రోడ్లను బాగు చేయించాలని స్థానికులు బిఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల పాలన ముగిసిన తరువాత అధికారులు జవాబుదారి తనంతో పని చేయడం లేదన్నారు. ప్రజలు ఏ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా వేగంగా స్పందించాలని కోరారు. మంచినీటికి మణికొండ వాసులు అల్లాడిపోతున్నారని, ట్యాంకర్లపై ఆధారపడుతున్నారన్నారు. మురుగు నీటిని చెరువుల్లో కాకుండా ప్రత్యేక లైన్ ద్వారా మూసీలోకి వదులాలని పేర్కొన్నారు. ఒకే ప్రాంతంలో ఉన్న ఆస్తులకు ఒకే రకమైన రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేయకుండా, ఇష్టానుసారంగా వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. భూగర్భ నీటి మట్టం పెరిగేలా ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్ నుంచి నార్సింగి మిలిటరీ రోడ్డు వేసేలా అధికారులు ప్రయత్నించాలన్నారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, కిరణ్, రాజేంద్ర ప్రసాద్, ఆరిఫ్, సుమ నళిని, బాలాజి, రమణమూర్తి పాల్గొన్నారు.

**డాక్టర్ ప్రతాపరెడ్డి పార్థీవదేహానికి ఎమ్మెల్యే నివాళి**

**కెపిహెచ్బి కాలనీ, మే 19, ప్రభాతవార్త**

కూకట్పల్లి పీపుల్స్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రతాపరెడ్డి పార్థివ దేహానికి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డితో ఉన్న అనుబంధాన్ని మాధవరం కృష్ణారావు గుర్తు చేసుకుంటూ పీపుల్స్ హాస్పిటల్ ద్వారా కూకట్పల్లి ప్రజలకు వైద్య సేవలు అందించడం ద్వారా ఎంతో సేవ చేశారని అన్నారు.

### అన్నమార్యుల సంకీర్తన లేకుండా కచేరీలకు ముగింపులేదు : డా. శేషుబాబు



గురువు శేషుబాబును సత్కరిస్తున్న దైవజ్ఞశర్మ, వనజ ఉదయ్, లలితారావు, అశోక్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 19 ప్రభాతవార్త :** శ్రీ అన్నమాచార్యుల సంకీర్తన ఒక్కటైనా లేకుండా సంగీత కచేరీల ప్రదర్శనలకు ముగింపు ఇవ్వమని సుప్రసిద్ధ శాస్త్రీయ కూచిపూడి నాట్యగురువు యక్షకంఠీరవ డా. పసుమర్తి శేషుబాబు అన్నారు. సంగీతం లేనిదే నాట్యంలేదు, నాట్యం లేనిదే సంగీతమూ లేదని, రెంటిలోనూ పంచజాతులున్నాయన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమయ్య 617వ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ సాంస్కృతిక సంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 14గంటలపాటు ఏకధాటిన నిర్విరామంగా అన్నమయ్యకు ప్రతిష్ఠాత్మకంగా సంగీత నృత్యనీరాజనం కన్నులపండువగా నిర్వహించడం శ్లాఘనీయమని నిర్వాహకురాలు, సంస్థ అధ్యక్షురాలు లయన్ లలితారావు, బృందాన్ని, నాట్యగురువులను, కళాకారుల తల్లిదండ్రులను అభినందించారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షోపన్యాసంలో భారత్ ఆర్ట్స్ భారతీయ సంప్రదాయాన్ని, భారతీయతను నేటి సమాజానికి అందించడం హర్షదాయకమన్నారు. నాట్యం సమాహార కళని, భగవత్ సాక్షాత్కారానికి సంగీతం, నాట్యం రెండూ ప్రధానమేనని, నృత్యగురువులు మన సంప్రదాయాన్ని శాస్త్రీయతను కొనసాగించాలని కోరారు. అన్నమయ్యలో అమ్మ, అన్న, అయ్య ఉన్నారని, సమస్త చరాచర జీవకోటికి దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిని ఆరాధించిన అక్షర అవధూత, మూర్తీభవించిన భక్తాగ్రేసరుడు శ్రీ తాళ్లపాక అన్నమార్యులకు 617వ జయంతికి సంగీత నృత్యనీరాజనం కళాకారులచే సమర్పించడం అద్వితీయమని కొనియాడారు. చివరిగా ముఖ్యఅతిథి డా. పసుమర్తి శేషుబాబు విశిష్ట అతిథులు దైవజ్ఞశర్మ, డా. వనజ ఉదయ్, డా. అశోక్, లయన్ లలితారావు తదితరులతో కలిసి సంగీత నృత్యగురువులను ఘనంగా సన్మానించారు. వందలాదిమంది చిన్నారి నృత్యకళాకారుల అన్నమయ్య సంగీత నృత్యనీరాజనంతో ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసి ఆహుతులను భక్తిమార్గంలో పయనింపజేసింది.

### అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ దినోత్సవం




అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ దినోత్సవం సందర్భంగా కొవొత్తులతో ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:**

వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.నిరంజన్‌రెడ్డి, ఎస్. మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవొత్తులతో ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఎయిడ్స్ శాఖ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఎయిడ్స్‌కు గురైన వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఎయిడ్స్ పట్ల అవగాహన, నివారణ ప్రయత్నాలకు సమాజం సమిష్టి నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి దశరథ్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్, కోట రమేశ్ తదితరులు పాల్గొన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్‌పై జరిగే పోరాటంలో నిరంతర విద్య, సానుభూతి ప్రాముఖ్యతను కనబర్చాలన్నారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే ముఠాగోపాల్



పనులను పరిశీలిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో నాలా స్లాబ్ పనులను వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు పడేలోపు ఈ పనులను పూర్తి చేయాలని అన్నారు. సోమవారం డివిజన్‌లోని ఆనంద్ నర్సింగ్ హోమ్ ఎదురుగా నాలా స్లాబ్ వర్కు పనులను బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహాతో కలిసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయక కార్యదర్శి సురేందర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్యాంసుందర్ చిట్టి, మాధవ్, రవి యాదవ్, సత్యనారాయణ, బ్రహ్మం అబ్బు బాయ్, వి ఎస్ రావు, విక్కీ, మేడి సత్యనారాయణ, లక్ష్మీపతి, మహమ్మద్, సుబ్బారావు, ధర్మ, యూనిస్, జి హెచ్ ఎం సి డి ఈ సన్నీ, ఏఈ విశేష్ తదితరులు పాల్గొన్నారు. ..

### హోప్ ఆఫ్ హంగర్ సంస్థ సేవలు అభినందనీయం...



నిత్యావసర నరుకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, మే 19, ప్రభాతవార్త**

హోప్ ఆఫ్ హంగర్ సంస్థ సేవలు అభినందనీయమనీ ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ వారు ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతులమీదుగా డివిజన్ పరిధిలో ఉన్న వృద్ధ నిరుపేద మహిళలకు బియ్యం, నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తమ డివిజన్ లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు ఆలేఖ్యకు వారి బృందానికి కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో షౌకత్ అలీ మున్నా, వెంకటేశ్వరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపారవేత్త అనుమానాస్పద మృతి

**పేట్ బషీరాబాద్, మే 19, ప్రభాతవార్త :** ఎన్‌సిఎల్ కాలనీలోని ప్లెజంట్ వాలీ అపార్ట్‌మెంట్‌లో ఒక వ్యాపారవేత్త అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందిన ఘటన చోటు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేసుకుంది. మృతుడు పీ.వి. రామ్మోహన్ రావు (60) కాగా, ఆయన ఫ్లాట్ నెంబర్ 301లో నివసిస్తున్నారు.సోమవారం ఉదయం 9 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ జె. సూర్య రోజులాగే డోర్ కొట్టిన సమయంలో లోపలి నుండి దుర్వాసన రావడంతో అప్రమత్తమయ్యాడు. అనంతరం అపార్ట్‌మెంట్ సభ్యుడు వేణుకి సమాచారం అందించి, వారి సహకారంతో లోపలికి వెళ్లగా రామ్మోహన్ రావు అచేతన స్థితిలో కనబడ్డారు. వెంట నే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. డాక్టర్లు వచ్చి పరిశీ లించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి నోటి నుండి తెల్లని నురుగు రావడం, రెండు చేతులు ముడు చుకున్న స్థితిలో ఉండటం కారణంగా మొదట అనుమానం వ్యక్తమైంది. మృతుడికి షుగర్, ఇతర ఆరోగ్య సమస్యలున్న ట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన రెగ్యులర్‌గా ఇన్సులిన్ వాడుతూ ఉండేవారని తెలిపారు. మొదటిగా ఎలాంటి అనుమానం లేనప్పటికీ, పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కుటుంబ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎం. రమేష్, మృతుడి బావమరిది, పేట్ బషీర్‌బాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రచయిత్రి నాట్యగురు ఉమాభారతికి వంశీ-ఎన్‌టిఆర్ ప్రవాస భారతీయ పురస్కార ప్రదానం

**రవీంద్రభారతి, మే 19 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, జె.వి.పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి, నృత్యకోవిద, నాట్యగురువు, సినీనటి కోసూరి ఉమాభారతికి ప్రతిష్ఠాత్మక వంశీ-ఎన్.టి.ఆర్ ప్రవాస భారతీయ పురస్కారం ప్రదానం చేశారు. ఇందుకు వేదికైన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో వంశీ సంస్థల వ్యవస్థాపకుడు కళాబ్రహ్మ, శిరోమణి డా. వంశీరామరాజు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు డా. పి.విజయబాబు, డా. సమ్మెట విజయ, సంతోష్‌బాబు, నందూరి సుందరీ నాగమణి తదితరులతో కలిసి ముందుగా కోసూరి ఉమాభారతిని ఘనంగా సన్మానించి వంశీ ఎన్‌టిఆర్ ప్రవాసభారతీయ పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం ఉమాభారతి రచించిన హృదయగానం నవలను డా. పి.విజయబాబు ఆవిష్కరించగా నందూరి సుందరీ నాగమణి పుస్తక విశ్లేషణ కావించారు. చివరిగా ఉమాభారతి రచించిన పుస్తకాలు నాట్యభారతీయంను డా. సమ్మెట విజయ; ఉమాభారతి కథలును సంతోష్‌బాబు కల్వకోట విశ్లేషణ చేశారు.

**తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సమావేశం**

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:** గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ రోడ్ అండ్ బిల్డింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్తు, నీటిపారుదల శాఖలతో పాటు జిహెచ్ఎంసి ప్రభుత్వ రంగ శాఖల ఇంజనీర్లతో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్. తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశం వివరాలను బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాజీద్ అహ్మద్ వెల్లడించారు. ఎస్ ఓ ఆర్ గురించి పలు విషయాల పైన సుదీరంగా చర్చ జరిపారు. ఇప్పుడు ఉన్నటువంటి అధునాతన యుగంలో మెటీరియల్ కాస్ట్. లేబర్ కాస్ట్. పెరగడం వల్ల పనులు చేయలేకపోతున్నారని, ఎస్ ఎస్ ఆర్ రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని మాజీద్ సూచించారు. దీంతో పాటు చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు విషయంలో సకాలంలో వచ్చేట్లు ఏర్పాటు చేయాలని. ఎస్ ఎస్ ఆర్ రేట్లు అన్ని డిపార్ట్మెంట్లో ఒకే రేటు విధానం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ వై లింగారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ ఇన్ బోర్డ్ మాజీ మెంబర్ సదానంద్ గౌడ్. మాజీ మెంబర్ నక్క యాదగిరి. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుజయ్ కుమార్. శీను నాయక్. రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కెపిహెచ్‌బి కాలనీలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం**



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కెపిహెచ్బి కాలనీ, మే 19, ప్రభాతవార్త**

కెపిహెచ్బి కాలనీ శ్రీశ్రీశ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శ్రీ మహాదేవ జీర్ణోద్ధరణ సహిత శ్రీ పార్వతి దేవి, శ్రీ ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో రాజేశ్వరరావు పాల్గొని శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి దివ్యదర్శనమును గావించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదఆశీర్వచనలతో ఆశీర్వదించగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. రాజేశ్వరరావు ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకొని ఆలయ కమిటీ సభ్యులకు కొన్ని సలహాలు సూచనలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా తన చేతుల మీదుగా వడ్డించి సేవ చేసుకున్నారు. తదనంతరం కమిటీ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎమ్.ఎస్.ఎన్ రాజు, ఎల్లారెడ్డి, వి శ్రీనివాసరావు, ఏ ప్రదీప్, తుల్జా గణేష్, సత్యనారాయణ, బాలాజీ నగర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు గోపి వారి మిత్ర బృందం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### హైదర్షాకోట్‌లో స్వాధ్యాయ సత్సంగానికి స్థలం కేటాయించాలని వినతి

**నార్సింగి, మే 19 ప్రభాతవార్త :**

గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామంలో స్వాధ్యాయ సత్సంగం, యోగా భవనాలకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని, భవనాన్ని నిర్మించి ఇవ్వాలని స్థానిక ప్రజలు సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వాధ్యాయ సత్సంగం ప్రతినిధులు మాట్లాడుతూ గత 40.సంవత్సరాల నుంచి హైదర్షాకోట్, బండ్లగూడ, కోకాపేట్, పీరంచెరువు, గంధంగూడ, నార్సింగి, మంచిరేవుల, షేక్‌పేట్ గ్రామాలలో పాండురంగ శాస్త్రి ప్రవచనాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజలను మెరుగైన సమాజ స్థాపనలో భాగస్వాములను చేయడం జరుగుతుందన్నారు. ఈ సత్సంగం కోసం 300.గజాల స్థలంను కేటాయించి, భవన నిర్మాణం పూర్తి చేయించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరామన్నారు. మా వినతిపత్రంను చదివిన తరువాత ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, త్వరలోనే మీ కోరిక నెరవేరుతుందని హామీనిచ్చారని తెలిపారు.

## మహమ్మద్ యాదుల్లాకు డాక్టరేట్ ప్రధానం



మహమ్మద్ యాదుల్లాకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ మాయాదేవి, చిత్రంలో సంగీత వ్యాస్ తదితరులు

**మలక్ పేట ,మే 19, ప్రభాతవార్త:**
దిల్ షుక్ నగర్ కు చెందిన మహమ్మద్ యాదుల్లాకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. విదేశీ హిందీ సాహిత్యం పై చేసిన పరిశోధన గురించి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ రావడం జరిగింది. అంబర్ పేట ప్రభుత్వ పాఠశాలలో హిందీ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ యాదుల్లా ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ హిందీ చైర్ పర్సన్ డాక్టర్ సంగీత వ్యాస్ మార్గదర్శకంలో ప్రవాసి లేఖక్ డాక్టర్ సురేష్ చంద్ర శుక్ల కధ అయిన సాహిత్యమే యుగ్ బోధ్ అంశంపై పరిశోధనా పత్రం సమర్పించడంతో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి హెడ్ ఆఫ్ హిందీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ మాయాదేవి ఆయనకు డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ యాదుల్లా మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి విదేశీ హిందీ సాహిత్యం తాను చేసిన పరిశోధన పై డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు. డాక్టరేట్ సాధించడంలో సహకరించిన డాక్టర్ సంగీత వ్యాస్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం: శ్రీనివాస్



టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న పందిరి రాము తదితరులు

**మలక్ పేట,మే 19, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి లు పేర్కొన్నారు. మలక్ పేట లో జరిగిన కార్యక్రమంలో సుప్రియ లారీ సర్వీసెస్ నిర్వాహకులు పందిరి రాము టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను చేపడుతుందని తెలిపారు. పందిరి రాము మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రేటర్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, అజంపుర డివిజన్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతమి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా సుధాకర్ గౌడ్



గౌతమి నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ

**వనస్థలిపురం మే.19.ప్రభాతవార్త :** బియన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటి ఏకగ్రీవంగా ఎన్నికైనది. సంక్షేమ భవనం లో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కె.సుధాకర్ గౌడ్,ఉపాధ్యక్షులు గా పి.పి.ఆర్.కె.రాజు, ఆర్.నారాయణరావు,ప్రధాన కార్యదర్శి గా కె.కిషన్,కోశాధికారిగా పి.సాయిబాబా, సంయుక్త కార్యదర్శులు గా ఎస్. గోపిచంద్, శ్రీవారి రెడ్డి,జి.సుకుమార్, కె,ఆంజనేయులు, ఈ.లోకేష్ చారి, కార్యనిర్వాహక కార్యదర్శులు గా కరుణాకర్,పి.ఎచ్.రెడ్డి, జె.రవి కుమార్,కార్యవర్గ సభ్యులు గా కె.భాస్కర్ గౌడ్,జి.జగన్,వి . శ్రీరామ్,జి.ప్రవీణ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## సచివాలయనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం



సచివాలయనగర్ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం మే.19.ప్రభాతవార్త :**
బి.యన్.రెడ్డ్.నగర్ డివిజన్ లోని సచివాలయనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైనది. ఎన్నికల అధికారులు గా వి. బాబురావు,ఎన్. వి.శివాజీ లు నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడు గా పింగళి సాంబశివరావు,ఉపాధ్యక్షులు గా జి.గోపాల్ రెడ్డి,ఎస్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గా జి.బాల్ రెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ గా సి.ఎచ్. సూర్యనారాయణ, స్పోర్ట్స్ సెక్రెటరీ గా పి.శ్రీధర్ కుమార్,కల్చరల్ సెక్రెటరీ గా హరీష్, కోశాధికారి గా ఆలేటి రవికుమార్,కార్యవర్గ సభ్యులు గా తడకమల్ల రవి కుమార్, నర్సింహారెడ్డి, ఎన్. ఎస్.ఆర్.మూర్తి, వి. హరగోపాల్,పి.సీతా రామ శాస్త్రీ, సి. సుధీర్ కుమార్ లు ఎన్నికైనట్లు ప్రకటించారు. బి.యన్.రెడ్డి.నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజెసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కి తనవంతు సహాయసహకారాలు అందజేస్తానన్నారు.నూతన కమిటీకి ఇప్పటి వరకు పనిచేసిన ప్రతినిధులు కూర్మా రావు,బి.హనుమంతరావు లు అభినందనలు తెలియజేశారు.

## మేడిపల్లి సర్వేనెంబర్ 103 లో గుడిసెలు వేసిన స్థానికులు

### -ప్రభుత్వ స్థలం అంటూ కూల్చివేసిన రెవెన్యూ అధికారులు



మేడిపల్లి సర్వేనెంబర్ 103 లో గుడిసెలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

**మేడిపల్లి , మే 19 ప్రభాతవార్త ;** మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వినాయక నగర్ లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సర్వేనెంబర్ 103 లో కాళీ ప్రాంతంలో కొందరు గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. తమకు గతంలో 1997 లో అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 150 మందికి 60 గజాల చొప్పున పట్టాలు ఇచ్చారు. కానీ అప్పటి నుంచి ల్యాండ్ పొజిషన్ చూపించలేదని బాధితులు వాపోయారు. ల్యాండ్ కోసం అప్పటి నుండి ఇప్పటి వరకు అధికారులను, నాయకులను కలిశామని హామీలు ఇస్తున్నారు తప్ప తమకు ఎవ్వరు న్యాయం చేయడం లేదని తమకు కేటాయించిన ప్రాంతంలో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నామని, బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేసి తమకు పట్టాలు ఇచ్చిన ప్రాంతాలు తమకే కేటాయించాలని కోరుతున్నారు. కానీ ఈ ప్రాంతంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న రెవెన్యూ అధికారులు వారికి సహకరిస్తున్నారు తప్ప తమకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పోరాట యోధులు సుందరయ్యకు ఘన నివాళులు



**తుర్కయంజాల్ మే 19(ప్రభాత వార్త) :**
దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, సిపిఐఎం వ్యవస్థాపకులు, స్వాతంత్ర సమరయోధులు పుచ్చలపల్లి సుందరయ్య గారి 40వ వర్ధంతిని తుర్కయంజాల్ సిపిఎం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ... పుచ్చలపల్లి సుందరయ్య వారు భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ తన చిన్నతనంలోనే అంటరానితనం, కుల వివక్షత పైన పోరాటం చేసిన మానవతావాది అని అన్నారు. చదువుకునే రోజుల్లోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపిన గొప్ప త్యాగశీలి అని అన్నారు. సుందరయ్య జీవితం నేటి సమాజానికి ఎంతో బలం ఇస్తుందని ఎదురు తిరిగే తెగవనిస్తుందని అన్నారు. సుందరయ్య ఆశయ సాధన కోసం కమ్యూనిస్టులంతా కృషి చేయాలని, అప్పుడే సుందరయ్య కి నిజమైన నివాళులర్పించిన వారమవుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు కే అరుణ్ కుమార్, నాయకులు బి శంకరయ్య, ఏ మాధవరెడ్డి, అంజయ్య, కుమార్, యాకయ్య, నాంపల్లి శంకర్, పరమేష్, శేఖర్ రెడ్డి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఐవిఎఫ్ మహిళ నూతన కమిటీ నియామకం :ఉప్పల



నియామక పత్రం అందజేస్తున్న ఉప్పల స్వప్న శ్రీనివాస్‌గుప్తా

**ఎల్బీనగర్, మే 19 ప్రభాతవార్త:** అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్(ఐవిఎఫ్) మహిళా విభాగ్ నూతన రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోల్ ఉప్పల క్యాంపు కార్యాలయంలో ఐవిఎఫ్ మహిళా విభాగం రాష్ట్ర నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను ఉప్పల సతీమణి స్వప్నతో కలిసి ఆయన అందజేశారు. రాష్ట్ర కమిటీ ప్రచార కమిటీ చైర్‌పర్సన్‌గా ములుగు శ్రీలత పద్మజ, కోఆర్డినేటర్‌గా స్వాతి, వీఆర్వోగా నాగమని, సభ్యురాలిగా ఏపూరి రాజ్యలక్ష్మి, అడ్వైజర్‌గా వావిలాల వినోద, లలిత, ఉపాధ్యక్షురాలుగా గోలి శ్రీలత, రంగారెడ్డి అధ్యక్షురాలుగా సంయుక్త, ప్రధాన కార్యదర్శిగా అనూష, కోశాధికారిగా శ్వేత, పిఆర్‌ఓగా సాయి సర్గి, పొలిటికల్ కమిటీ ఛైర్పర్సన్‌గా సత్యకళ, అదనపు ప్రధానకార్యదర్శిగా లావణ్య, సేవాదళ్ కమిటీ ఛైర్పర్సన్‌గా మాధురి, చద్రపురినగర్ డివిజన్ అధ్యక్షురాలిగా శ్రీలత, కార్యదర్శి జ్యోతి, కోశాధికారిగా ఉషారాణి, భజరంగ్‌నగర్ డివిజన్ అధ్యక్షురాలిగా ఉమ, ప్రధాన కార్యదర్శి స్వప్న, కోశాధికారిగా అన్నపూర్ణ నియామకమయ్యారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మహిళ సోదరీమణులు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలు ఉన్నతంగా ఎదగాలన్నారు. అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ మహిళ విభాగ్ అధ్యక్షురాలు గా పనిచేసిన రేఖ గుప్త అంచలంచెలుగా ఎదిగి డిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారని ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి పబ్బా చంద్రశేఖర్ గుప్త, కటకం శ్రీనివాస్, చింతల రజినీకాంత్‌గుప్త, లోకేష్, ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, మహిళ విభాగం అధ్యక్షురాలు చంద భాగ్యలక్ష్మి, ప్రధానకార్యదర్శి మంజుల, మనిమల అర్చన వినోద తదితరులు పాల్గొన్నారు.

## లింగమయ్య గుట్ట ఆలయ ప్రాంగణ అభివృద్ధికి కృషి : సబితా ఇంద్రారెడ్డి



లింగస్వామి కళ్యాణోత్సవానికి హాజరైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కర్మన్‌ఘాట్ టెంపుల్ మాజీ ఛైర్‌పర్సన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ యాతం శ్రీశైలం యాదవ్

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:**
నాదర్‌గుల్‌లోని లింగమయ్య గుట్ట ప్రాంత అభివృద్ధికి, ఇక్కడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. లింగమయ్య జాతర మహోత్సవం సందర్భంగా గుట్టపై జరిగిన లింగస్వామి కళ్యాణ మహోత్సవానికి ఆమె హాజరై స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పురాతనమైన ఈ గుట్టపై ఉన్న లింగస్వామి ఆలయ ప్రాంగణ అభివృద్ధి, ఇక్కడికి వచ్చే భక్తులకు మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ టెంపుల్ మాజీ ఛైర్‌పర్సన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పాల్గొన్నారు.

**లింగస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి**

మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి నాదర్‌గుల్‌లోని లింగమయ్య గుట్టను సందర్శించి లింగస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత లింగమయ్య గుట్టపై జాతర జరుగుతుండడం హర్షణీయమన్నారు. స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## రాజగోపురం దర్శనంతోనే శివయ్య అనుగ్రహం

### -శ్రీ తాండవ కాశీ క్షేత్రం పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ
### -నేరేడ్మెట్ శ్రీ కాశీ విశ్వనాథ ఆలయ రాజగోపురం వైభవంగా ప్రారంభం
### -భారీగా తరలివచ్చిన భక్తజన సందోహం , మారుమోగిన శివనామ స్మరణ



**నేరెడ్ మెట్, మే 19ప్రభాతవార్త :**
మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నేరేడ్మెట్ ప్రధాన రోడ్డులో ఉన్న శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయం ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా భారీ స్థాయిలో నిర్మించిన ఆలయ రాజగోపురం ప్రారంభోత్సవం సోమవారం ఉదయం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ తాండవ కాశీ క్షేత్రం పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామిజీ రాక సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఆయన నేరుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో ఐదు కలశాలకు స్వామీజీ ప్రత్యేక పూజలు నిర్వహించి యంత్ర ప్రతిష్ట, సతీసమేత నవగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామదేవతలు శ్రీ నల్ల పోచమ్మ ,శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్ల వాహన యంత్ర ప్రతిష్టలను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపరులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ అనుగ్రహ భాష్యమిస్తూ శ్రీశైలంలో శిఖర దర్శనం వల్ల ముక్తి లభిస్తుందని , నేరేడ్మెట్ లోని శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయ రాజగోపురం సందర్శిస్తే శివానుగ్రహం కలుగుతుందని స్వామీజీ స్పష్టం చేశారు. ఇక్కడి ఆలయం మంచి క్షేత్రంగా విరాజిల్లుతుందని శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథుడు ఇక్కడ సాక్షాత్తుగా ఉన్నారని అన్నారు. చేశారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం పండ్లు పూలు దక్షిణ సమర్పించారు. అనంతరం స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ రాజగోపురం యంత్ర శిఖర ప్రతిష్ట సందర్భంగా భారీ స్థాయిలో భక్తజనం తరలివచ్చారు. నేరేడుమెట్ పరిసర ప్రాంతాలలోని వివిధ దేవాలయాల కమిటీ వారు ఆలయ రాజగోపురం సందర్శించారు ఈ సందర్భంగా పలువురు దాతలను , ఆలయాల కమిటీల నిర్వాహకులను శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు గత మూడు రోజులుగా కొనసాగిన రాజగోపురం శిఖర ప్రతిష్ట పూజలు వైభవంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ జిఎం రమేష్, అధ్యక్షులు బి ఎం రాజారామ్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ రాజు ,ఆలయ ప్రధాన కార్యదర్శి గంగాధరి రాజు, సామల సత్యనారాయణ, రియల్ విజయ్ కుమార్,గంగాధర్ కృష్ణ, కొత్తింటి అశోక్, ఎలిమెల గణేష్, బడే మనోజ్, సువర్ణ లక్ష్మి, జంగిలి శివకుమార్, కట్టెల నరేష్, మధ్యలో సుధాకర్, ఆకుల సంతోష్, జంగిలి మహేశ్వరి, ఆకుల మీనా, ఉమాదేవి, భువనేశ్వరి, గంగాధరి నేహా తో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు గంటలపాటు ట్రాఫిక్ పోలీస్ అధికారులు రోడ్ డైవర్షన్ చేసి రాజగోపురం శిఖర ప్రతిష్ట సజావుగా జరిగేందుకు సహకరించారు.

## ఈస్ట్ కల్యాణపురిలో సిసి రోడ్డు పనులు



కల్యాణపురిలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ ఈస్ట్ కల్యాణపురిలో రూ.52లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నిర్మించే సిసి రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా అన్ని ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాధిక, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, బాలకృష్ణ, సతీష్, రాజశేఖర్, రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతి




హబ్సిగూడలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్న కాలనీ నేతలు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ కాకతీయనగర్ కాలనీ స్ట్రీట్‌నెం.2లో ఎటువంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న అనధికారింగా నిర్మిస్తున్న హోటల్ నిర్మాణ పనులు నిలిపివేయాలని పలువురు కాలనీ నేతలు సోమవారం ప్రజావాణిలో డిప్యూటి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు వంటేరు ఉపేందర్‌రెడ్డి, ఎవిఎస్ రాజు, నందన్‌లు మాట్లాడుతూ నగారిక అపార్ట్‌మెంట్ ఎదురుగా ఎటువంటి అనుమతి లేకుండా కాఫీ షాప్ రెస్టారెంట్ ప్రారంభిస్తున్నారని, దీనికి ఎటువంటి అనుమతులు లేవని వారు ఫిర్యాదు చేశారు. గత మూడు నెలలుగా దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. హోటల్ నిర్మాణం వల్ల స్థానికులకు ఇబ్బంది కలుగుతుందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సిపిఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



సిపిఎం వ్యవస్థాపక కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిపిఎం నేతలు

**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :**
భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సిపిఎం వ్యవస్థాపక కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ సిపిఎం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం. వినోద, ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న, పార్టీ నేతలు వెంకటేష్, ప్రభాకర్, సుగుణమ్మ, శశీ, నవీన్, సాయి, భాను తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిపిఎం పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కార్పొరేటర్



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మే 19 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ క్రాంతినగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సదుపాయాలు, అందుతున్న సౌకర్యాలు, సిబ్బంది సమయానికి వస్తున్నారా అనే విషయం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాను కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న సామ రంగారెడ్డి అరుణసురేందర్‌యాదవ్

**ఎల్బీనగర్, మే 19 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బ్లైండ్స్ కాలనీలో బిజెపి సీనియర్ నాయకులు సామ రంగారెడ్డి, డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి నేతృత్వంలో రొమ్ము క్యాన్సర్ పరీక్ష, అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల పైబడిన మహిళలందరూ ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని, రొమ్ము క్యాన్సర్ సాధారణంగా 50 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళలను ప్రభావితం చేస్తుందని అన్నారు. కణితులను తొలగించడానికి శస్త్రచికిత్స ద్వారా లేదా క్యాన్సర్ కణాలను చంపడానికి చికిత్స ద్వారా రొమ్ము క్యాన్సర్ నివారించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రజ్ఞా, కాలనీవాసులు సరస్వతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కరించాలని ప్రజావాణిలో కార్పొరేటర్ వినతి



కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్

**ఎల్బీనగర్, మే 19 ప్రభాతవార్త:** డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్‌ను కలిసి పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలనీ దృష్టిలో పెట్టుకొని సరూర్నగర్ చెరువు నుండి హుస్సేన్ మటన్‌షాప్ వద్ద టన్నెలింగ్ వర్క్ పనులు అర్ధంతరంగా కాంట్రాక్టర్ ఆపిన పనులు పూర్తి చేయాలని కోరారు. స్ట్రామ్‌వాటర్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణం పనుల కోసం నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

## నాదర్‌గుల్‌లో ఘనంగా లింగమయ్య గుట్ట జాతర

### -హాజరైన బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



లింగమయ్య స్వామికి పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య: పక్కన మహేశ్వరం బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, మే 19 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్ల లోని మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ గ్రామ శివార్లలోనున్న పురాతన లింగమయ్య గుట్టపై శ్రీ లింగస్వామి కళ్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. దశాబ్దాల తర్వాత గ్రామ పెద్ద గొల్లలు కార్యనిర్వహణలో స్థానిక శ్రీగోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా లింగమయ్య జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎవిఎన్‌రెడ్డి, అంజిరెడ్డి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి సతీమణి క్యావ కిషన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్‌లతో పాటు పలువురు నాయకులు లింగస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. జాతర మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌కు వినతి

**సరూర్‌నగర్, మే 18 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లోనున్న బీరప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 30వ తేదీ నుండి జూన్ 5వ తేదీ వరకు శ్రీ బీరప్పస్వామి కామరతీ దేవి కళ్యాణ మహోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కార్పొరేషన్ తరపున రహదారుల మరమ్మతులు, పారిశుధ్య పనులు చేయించాలని శ్రీ బీరప్ప స్వామి దేవస్థాన కమిటీ కమిషనర్‌ను కోరింది. ఈ మేరకు సోమవారం బాలాపూర్ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేవస్థానం కమిటీ వారు కమిషనర్ సరస్వతిని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున బాలాపూర్ గ్రామంలో, బీరప్ప దేవాలయం వద్ద దెబ్బతిన్న రహదారులను బాగు చేయించాలని కోరారు. ఆలయానికి వచ్చే రోడ్లన్నీ శుభ్రంగా ఉండేటట్లు పారిశుధ్య పనులు చేయించాలని వారు కమీషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ పెద్ద కురుమ కొంద్రు మల్లేష, ఇక్కె సత్యనారాయణ, రావుల మల్లేష్, మేకల సంజీవ, రావుల మహేందర్, ఇక్కె శ్రీనివాస్, చిత్తాపురం బల్వంత్, ఇక్కె శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## నాలా బకెట్ సేల్టింగ్ పనుల పరిశీలన



**మల్కాజిగిరి మే19,ప్రభాతవార్త :**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సెంట్ యాన్స్ పి వి ఎన్ కాలనీ నుండి సత్య రాఘవేంద్ర కాలనీ వరకు నాలా బకెట్ సేల్టింగ్ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని డివిజన్లో ఉన్న నాళాలను డీ సెల్టింగ్ చేయిస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్ వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్ నాయకులు బాబు, సత్యనారాయణ, కిషోర్,ఉదయ్ కుమార్,జాలయ్య గౌడ్,వెంకటేష్, జాయ్, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చొరవ

### -తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

### -అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులమంటూ ప్రభుత్వ భూముల జోలికి వస్తే కఠిన చర్యలుంటాయ్

**అబ్దుల్లాపూర్‌మెట్, మే19, ప్రభాతవార్త :**
అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి హద్దులు, ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయించాలన్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్‌రెడ్డి రంగారెడ్డిల ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని గ్రామాల్లో 865.11 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు పేర్కొన్న ఆయన అందులో 379.25 ఎకరాల భూమి ఖాళీగా ఉందని ప్రస్తుతం ఆ విస్తీర్ణానికి చుట్టూ హద్దులు ఏర్పాటు ఫెన్సింగ్ వేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు పలువురు యత్నించగా అలాంటి వారికి అడ్డుకట్ట వేసి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరుతో కానీ, ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి అనుచరులమంటూ ఎవరైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ భూమిని సర్వే చేయించి మొదటగా తక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. బాటసింగారం లోని సర్వేనెంబర్ 10లో ఉన్న 250 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి భూములను కాపాడుతున్నామన్నారు.